# వరి ధాన్యం కొనకుంటే ఢిల్లీ పీఠం కదిలిస్తాం

- బిజెపికి సినిమా చూపిస్తాం
- ఇందిరాపార్కు ధర్నాలో మంత్రి తలసాని
- రాష్ట్ర వ్యాప్తంగా టిఆర్ఎస్ ధర్నాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుల నుంచి ధాన్యం కొనకుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పీఠం కదిలిస్తాం. గులాబి సైన్యం, రైతులు తలుచుకుంటే బిజెపి ప్రభుత్వం కూలుతుంది. ఇది ట్రయలర్ మాత్రమే... ఇంకా అసలు సినిమా మున్ముందు చూపిస్తం' అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ బిజెపి సర్కార్‌పై మండిపడ్డారు. వరి ధాన్యం కేంద్రమే కొనాలనే డిమాండ్‌తో శుక్రవారం ఇందిరాపార్క్‌లోని ధర్నాచౌక్‌లో టిఆర్ఎస్ ధర్నా చేపట్టింది. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో మంత్రులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. వరి కంకులు, వడ్ల గింజలు పట్టుకుని నిరసన తెలిపారు. మంత్రి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. రైతు కంట నీరు పెట్టించిన ఏ ప్రభుత్వాలు నిలబడినట్లు చరిత్రలో లేదన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకపోతే రానున్న రోజుల్లో కేంద్రానికి అసలు సినిమా చూపిస్తామని హెచ్చరించారు. నష్టాల ఊబిలో ఉన్న రైతాంగాన్ని, వ్యవసాయ రంగానికి రాష్ట్రం ఏర్పడినంక సిఎం కెసిఆర్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో వ్యవసాయం లాభసాటిగా మారిందన్నారు. కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడం వంటి అనేక కార్యక్రమాలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగి అత్యధిక వరిపంటను పండిస్తూ దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధించిందని చెప్పారు.

వ్యవసాయాన్ని, రైతులను ప్రోత్సహించాల్సిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయబోమని చెప్పడం తగదన్నారు. రాష్ట్రంలోని బిజెపి నేతలు మాత్రం వరి సాగు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డ్రామాలు ఆడుతూ రైతుల జీవితాలతో ఆడుతున్నారని విమర్శించారు. నిజంగా రాష్ట్ర బిజెపి నేతలకు రైతులపై ప్రేమ ఉంటే కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ఒప్పించి అనుమతులు తీసుకురావాలని సవాల్ చేశారు.కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకొస్తోందన్నారు. కరోనా, లాక్‌డౌన్ సమయంలో పండించిన పంటను ఎలా అమ్ముకోవాలో తెలియని అయోమయ పరిస్థితులలో ఉన్న రైతుల పంటలను కొనుగోలు చేసి ఆదుకున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ మాట్లాడుతూ.. ఆరు నెలల నుంచి ఢిల్లీలో నూతన వ్యవసాయచట్టాలపై రైతులు పోరాడుతుంటే... కేంద్రం పట్టించుకుంటలేదన్నారు. నూతన చట్టాల్లో కనీస మద్దతు ధర పొందు పర్చలేదన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొంటామని లేఖ తేవాలన్నారు. యాసంగి ధాన్యం కొంటామని కేంద్రం నుంచి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యేలు దానంనాగేందర్, మాగంటిగోపీనాథ్, కాలేరు వెంకటేష్, ముఠాగోపాల్, సుధీర్‌రెడ్డి, తదితులు పాల్గొన్నారు.

**రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు**

కేంద్ర ప్రభుత్వం యాసంగిలో వరి ధాన్యం కొనుగోలు చేయాల్సిందే అని డిమాండ్ చేస్తూ సీఎం కేసీఆర్ ఆదేశాలతో టీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధర్నాలు చేపట్టారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఈ ఆందోళనలో పాల్గొని ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. కామారెడ్డి జిల్లా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ క్రాస్‌రోడ్‌లో నిర్వహించిన ధర్నాలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన తెలిపారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తాండూర్ పట్టణంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలో క్లాక్ టవర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కొత్తగూడెంలో కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అశ్వారావుపేటలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన, ధర్నా చేపట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ధర్నాలు చేపట్టాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో వి.శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేపట్టారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే జోగు రామన్న, రాష్ట్ర డెయిరీ చైర్మెన్ లోక భూమారెడ్డి, మాజీ ఎంపీ గోడం నగేశ్, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పాల్గొన్నారు. హన్మకొండలో నిర్వహించిన ఆందోళనలో మంత్రి ఎర్రబెల్లి పాల్గొని మాట్లాడారు. ఖమ్మంలో నిర్వహించిన ధర్నాలో ఎంపీ నామ, మంత్రి అజయ్, మాజీ ఎంపీ పొంగులేటి పాల్గొన్నారు. సత్తుపల్లిలో సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో ధర్నాలు కొనసాగాయి.

## యాదాద్రిలో లగ్జరీ హోటల్

### హోటళ్ల మధ్య నిర్వహణా ఒప్పందం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రిలో లగ్జరీ హోటల్ ప్రాజెక్ట్ అందుబాటులోకి రానుంది. లక్ష్మీ నివాసం పేరుతో ఏర్పాటైన ఈ హోటల్ యాదాద్రికి వచ్చే యాత్రికులకు అద్భుతమైన ఆతిథ్యం ఇవ్వనుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ లక్ష్మీ నివాసం డెవలపర్స్ దీన్ని నిర్మించింది. 400 సూట్ గదులు కలిగిన ఈ హోటల్ జాతీయ స్థాయి ప్రమాణాలను కలిగి ఉంది. అన్ని వసతులు, సకల సదుపాయాలతో ఈ హోటల్‌ను ఏర్పాటు చేశారు. లక్ష్మీ నివాసం లగ్జరీ హోటల్ ప్రాజెక్ట్ నిర్వహణ బాధ్యతలను అపీజే సురేంద్ర హోటళ్ల గ్రూప్ (ది పార్క్) పర్యవేక్షించనుంది. దీనికి సంబంధించి లక్ష్మీ నివాసం, అపీజే సురేంద్ర హోటళ్ల గ్రూపు మధ్య ఒప్పందం కుదిరింది. అపీజే సురేంద్ర హోటళ్ల గ్రూపు బ్రాండ్ అయిన జోన్ కనెక్ట్ కింద ఈ హోటల్‌ను నడపనుంది. వచ్చే ఏడాది మార్చి 20వ తేదీన ఇది ప్రారంభం కానుంది.

## సమస్యలు పరిష్కరించేందుకే పరిశీలనలు

### దక్షిణ మధ్య రైల్వే జీఎం మాలవ్యా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయాణీకులు, రైల్వే సంబంధ సమస్యలను పరిష్కరించేందుకే పరిశీలన చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాలవ్యా అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌ను ఆయన పరిశీలించారు. పగిడిపల్లి రైల్వే స్టేషన్ నుంచి మిర్యాలగూడ వరకు అండర్‌పాస్, ట్రాక్, వంతెనలు, లెవెల్ క్రాసింగ్‌లను పరిశీలించినట్టు చెప్పారు. పలువురు ప్రయాణీకులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి వారు ఇచ్చిన విన్నపాలు తీసుకున్నట్టు తెలిపారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట సిపిఒఎం ధనుంజయ, బీఆర్ఎం మోహన్ రాజా, ఎస్ఎస్ జానిబాబా ఉన్నారు.

## ఘనంగా యూనియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 103వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని బాలానగర్ శాఖలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బ్యాంకు విశ్రాంత ఉద్యోగి మహమ్మద్ గఫర్, సినిగేయ రచయిత వెనిగళ్ల రాంబాబుకు సన్మానం చేశారు. బ్యాంక్ అందించే పథకాలు, సేవల గురించి వక్తలు వివరించారు. ఈ సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ బి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు.

# టిఆర్ఎస్, బిజెపి ద్వంద వైఖరి వీడాలి

- వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి
- సిపిఎం, సిపిఐ, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసనలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వంద వైఖరితో రైతులను నిలువునా ముంచుతున్నాయనీ, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వీడి వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో నిరసనలు చేపట్టారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద సిపిఎం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టే రీతిలో ఉన్నాయని విమర్శించారు. తరుగులో కోత విధించవద్దనీ, గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో సిపిఎం, ప్రజాంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం, పెద్దపల్లి రామగుండం మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సిపిఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ క్రాంతి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

## నవ్య ప్రింటింగ్ ప్రెస్‌లో సోదాలు

### ఆర్కె జీవిత చరిత్ర పుస్తకాలు స్వాధీనం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంబర్‌పేట మూసారాంబాగ్‌లోని పిఒడబ్ల్యు సభ్యురాలు సంధ్య భర్త రామకృష్ణా రెడ్డికి చెందిన నవ్య ప్రింటింగ్ ప్రెస్‌లో డిసిపి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు సోదాలు నిర్వహించారు. నిషేధిత మావోయిస్టు సాహిత్యం ప్రింట్ చేస్తున్నారన్న సమాచారంతో సోదాలు నిర్వహించినట్టు పోలీసులు తెలిపారు. ఇటీవల మృతి చెందిన మావోయిస్టు అగ్రనేత ఆర్కె జీవిత చరిత్రను పుస్తక రూపంలో ప్రింట్ చేస్తున్నట్టు గుర్తించి పలు పుస్తకాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఆర్కె భార్య శిరీష, పిఒడబ్ల్యూ సభ్యురాలు సంధ్య ప్రింటింగ్ ప్రెస్ వద్దకు చేరుకుని పోలీసులను ప్రశ్నించారు. బైండింగ్ చేసిన వెయ్యి పుస్తకాలను, మెటిరియల్‌ను సీజ్ చేసినట్టు మలక్‌పేట ఎసిపి వెంకటరమణ తెలిపారు. పుస్తకాల ప్రింటింగ్‌కు సంబంధించి ఎలాంటి రశీదులు లేవని పేర్కొన్నారు. పుస్తకాలలో నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన భావజాలాన్ని పెంపొందించే విధంగా ఉందని ఎసిపి వివరించారు.



## భాగవత కథలు నేటి తరం తెలుసుకోవాలి

ప్రజాశక్తి - కల్చరల్

భాగవత కథల్లో ఎన్నో నీతి బోధక అంశాలు ఉన్నాయని, నేటి తరం తెలుసుకొని ఆచరించాలని చారిత్రక నవలా రచయిత ప్రొఫెసర్ ముదిగొండ శివ ప్రసాద్ అన్నారు శ్రీత్యాగరాయ గాన సభలో శుక్రవారం వై.ఎస్.ఆర్.మూర్తి చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో త్రోవకుంట వెంకట సుబ్రహ్మణ్యం సంకలనం చేసిన 'భాగవత నామకోశం' గ్రంథ ఆవిష్కరణ సభ జరిగింది. సంపుటిని ధర్మ మార్గం ఛానెల్ అధినేత డాక్టర్ వి.భాస్కర్ రాజు ఆవిష్కరించరించారు. ఈ సందర్భంగా ముదిగొండ శివ ప్రసాద్ మాట్లాడుతూ.. పోతన విరచిత భాగవత కథలలోని సారాన్ని గ్రహించి ఆలోచనాత్మక వ్యాఖ్యానంతో సుబ్రహ్మణ్యం తన గ్రంథంలో పొందుపరచారని అభినందించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలెటి పార్వతీశం మాట్లాడుతూ, భాగవత నామకోశంలోని ప్రతి అంశం తెలుసుకోదగినదని వివరించారు. ప్రతి పదానికి అంతరార్థాన్ని వివరించారని తెలిపారు. వై. శ్రీరామచంద్రమూర్తి నిర్వహణలో జరిగిన కార్యక్రమానికి సాధన నరసింహచార్య వ్యాఖ్యానం చేశారు. కవి అక్కిరాజు సుందర రామకృష్ణ, రచయిత జన్నభట్ల సింహ ప్రసాద్, చిత్రకళాకారులు షకీల్ అహ్మద్, తదితరులు పాల్గొన్న సభకు కార్యదర్శి ఉజ్వల స్వాగతం పలికారు. కార్యక్రమానికి తొలుత డాక్టర్ జ్యోతి శేఖర్ శిష్య బృందం సీత రామారావు రచించిన శ్రీ కృష్ణ వసంతం నృత్య రూపకం కిరణ్మయి నృత్య దర్శకత్వంలో నయన మోనోహరంగా ప్రదర్శించారు.

## శాంతి భద్రతలు కాపాడే బాధ్యత ఐపిఎస్‌లదే

- ట్రైనీ ఐపిఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో అజిత్ దోవల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ సమగ్రత, ఐక్యత, శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర ఐపిఎస్‌లదేనని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో జరిగిన 73వ ఐపిఎస్ ట్రైనీ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్‌కు అజిత్ దోవల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. యువ ఐపిఎస్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్ నుంచి ఆయన గౌరవ సెల్యూట్‌ను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం ఎదుర్కొంటున్న తీవ్రవాద, ఉగ్రవాద, మతపరమైన సమస్యలతో ఏర్పడే శాంతి భద్రతల సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత ఐపిఎస్ అధికారులదేనని అన్నారు.

ఇందుకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ప్రజల శాంతి సౌఖ్యాలను కాపాడాల్సిన పోలీసులకు ఐపిఎస్‌లు తగిన నాయకత్వాన్ని నెరపాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ సారి ఎంపికైన ఐపిఎస్‌లలో మహిళలూ పెద్ద సంఖ్యలో ఉండటాన్ని ఆయన అభినందించారు. ఎన్‌పిఎ డైరెక్టర్ అతుల్ కర్వాల్ మాట్లాడుతూ.. ఈ సారి 149 మంది ఐపిఎస్ అధికారులు శిక్షణను ముగించుకోగా ఇందులో 31 మంది మహిళలు ఉన్నారన్నారు. అలాగే 17 మంది విదేశీయులున్నారనీ, వీరు భూటాన్, మాల్దీవ్, నేపాల్ దేశాల వారని ఆయన చెప్పారు. వీరికి శాంతి భద్రతలు కాపాడటం మొదలుకొని నేర విచారణ, జ్యుడిషియల్, పౌర హక్కులు మొదలైన అనేక అంశాలలో శిక్షణ అందిందన్నారు. ఈ కోర్సులో అన్ని రంగాలలో అత్యుత్తమ నైపుణ్యాన్ని కనబరిచిన దర్పణ్ అహ్లూవాలియాకు ఆల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని బహూకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రానికి చెందిన పలువురు సీనియర్ ఐపిఎస్ అధికారులు హాజరయ్యారు.

# 172 మందికి కరోనా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కొత్తగా 172 మందికి కరోనా సోకింది. ఒకరు మరణించారు. గడిచిన 24 గంటల్లో 39,804 మందికి టెస్టులు చేసినట్టు కోవిడ్-19 శుక్రవారం మీడియా బులెటిన్ వెల్లడించింది. ప్రభుత్వాస్పత్రుల్లో 34,795 మందికి, ప్రయివేటు ఆస్పత్రుల్లో 5,009 మందికి పరీక్షలు నిర్వహించారు. మరో 1,007 మంది రిపోర్టులు రావాల్సి ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం 3,741 యాక్టివ్ కేసులున్నాయి. జిల్లాల వారీగా చూస్తే జీహెచ్ఎంసీలో అత్యధికంగా 51 మందికి కరోనా సోకింది. అతి తక్కువగా ఆరు జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ఈ వ్యాధి బారిన పడ్డారు. మరో ఆరు జిల్లాల్లో ఒక్క కేసు నమోదు కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా చేసిన టెస్టుల్లో గురువారంతో పోలిస్తే శుక్రవారం 16 జిల్లాల్లో కేసులు పెరిగాయి. ఆదిలాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కొమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజిగిరి, నారాయణపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్ధిపేట, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ జిల్లాల్లో కేసులు పెరిగాయి. జిహెచ్ఎంసితో పాటు భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్ నగర్, మంచిర్యాల, ములుగు, నాగర్ కర్నూల్, నల్లగొండ, నిర్మల్, నిజామాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో తక్కువగా నమోదయ్యాయి.


**MIC Electronics Limited**

Regd Off: A-4/II, Electronic Complex, Kushaiguda, Hyderabad-500062.

**UN-AUDITED FINANCIAL RESULTS FOR THE SECOND QUARTER AND HALF YEAR ENDED ON 30TH SEPTEMBER 2021** (Rs.in crores)

| S. No. | Particulars | 3 Months ended 30.09.2021 Un-audited | Previous 3 months ended 30.06.2021 (Un-Audited) | Corresponding 3 months ended in the previous year 30.09.2020 Un-audited | Year to date figures for the period ended 30.09.2021 (6M) (Un-Audited) | Year to date figures for the period ended 30.09.2020 (6M) Un-audited | Previous accounting Year ended 31.03.2021 (Audited) |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Total Income from Operations | 3.45 | 0.27 | 1.78 | 3.72 | 1.78 | 4.23 |
| 2 | Net Profit/(Loss) for the period (before Tax, Exceptional and/ or Extraordinary items) | (1.05) | (2.15) | (3.54) | (3.20) | (5.49) | (5.41) |
| 3 | Net Profit / (Loss) for the period before tax (after Exceptional and/ or Extraordinary items) | (1.05) | (2.15) | (3.54) | (3.20) | (5.49) | (5.41) |
| 4 | Net Profit/(Loss) for the period after tax (after Exceptional and/or Extraordinary items) | (1.05) | (2.15) | (3.54) | (3.20) | (5.49) | (5.41) |
| 5 | Total Comprehensive Income for the period [Comprising Profit / (Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)] | (1.05) | (2.15) | (3.54) | (3.20) | (5.49) | (5.41) |
| 6 | Equity Share Capital | 11.01 | 44.05 | 44.05 | 11.01 | 44.05 | 44.05 |
| 7 | Reserves (excluding Revaluation Reserve) as shown in the Audited Balance Sheet of the previous year | 0.00 | 0.00 | 0.00 | (16.44) | (184.89) | (46.28) |
| 8 | Earnings Per Share (of Rs.2/- each) (for continuing and discontinued operations | | | | | | |
| | 1. Basic: | (0.19) | (0.10) | (0.16) | (0.58) | (0.25) | (0.25) |
| | 2. Diluted: | (0.19) | (0.10) | (0.16) | (0.58) | (0.25) | (0.25) |

**Notes :**

1. Corporate Insolvency Resolution Process (CIRP) has been initiated in respect of MIC Electronics Limited ("company") under the provisions of the Insolvency and Bankrupty Code, 2016 ('Code') by an order of the National Company Law Tribunal (NCLT), Hyderabad with effect from 13th March 2018. As per Section 17 of the Code, appointed Mr.N.Prabhakar as the interim Resolution Professional (IRP) in terms of IBC. Mr.N.Prabhakar was subsequently confirmed by the committee of creditors (CoC) as the Resolution Professional (RP).
   Thereafter Honourable NCLT, Hyderabad bench has passed an order dated 31st July 2019 approving the Resolution Plan submitted by the resolution applicant. Consequently new board of directors have been appointed by the company. The above results have been reviewed by the Audit Committee at its meeting held on 12th November 2021 and approved by the Board of Directors of the Company at its meeting held on 12th November 2021. These results have been subjected to limited review by the statutory auditors.
2. The outbreak of Coronavirus (COVID-19) pandemic globally and in India is causing significant disturbance and slow down of economic activity. As on the date of these results, the Company based on the internal and external information available and the current indicators, believes that there is no material impact of the pandemic on its overall performance, except as mentioned hereinbefore. However, given the uncertainties associated with the nature and duration of COVID-19, the Company continues to monitor the situation closely and shall take appropriate actions based on material changes (if any).
3. During the quarter, the Company has two segments i.e., LED Products and Medical and other appliances
4. The figures for the quarter ended September 30, 2021 as reported in these financial results are the balancing figures between the un-audited figures in respect of 6 months period ended 30th September 2021 and published year to date figures for the first quarter ended 30th June 2021.
5. Figures have been rearranged whereever necessary.

Place: Hyderabad
Date : 12.11.2021

Sd/-
Kaushik Yalamanchali
Director


## కృష్ణా జలాల విషయం నాలుగు నెలల పంచాయితీ కాదు..

### మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా జలాల వివాదం నాలుగు నెలల విషయం కాదనీ, ఏడేండ్ల పంచాయితీ అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కృష్ణా జలాల వివాద పరిష్కారం కోసం కొత్త ట్రైబ్యునల్ ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందంటూ సిఎం కెసిఆర్ చేసిన వ్యాఖ్యలపై గురువారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్.. 'కృష్ణా జలాల అంశం నాలుగు నెలల కిందనే నా దగ్గరకు వచ్చింది. అప్పటి నుంచే నా వద్ద పెండింగ్‌లో ఉంది.. దీనిపై నన్ను నిందించడం తగదు' అని వ్యాఖ్యానించారు. దానిపై శుక్రవారం మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన 42 రోజుల్లోనే అప్పటి కేంద్ర మంత్రి ఉమాభారతికి కృష్ణా జలాల పంపకంపై ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇంటర్ స్టేట్ రివర్ వాటర్ డిస్ట్రిబ్యూషన్ యాక్ట్‌లో ఏదైనా ఒక రాష్ట్రం కంప్లైంట్ చేస్తే దాన్ని ఏడాదిలోగా పరిష్కరించాలనీ, లేదా ట్రిబ్యునల్‌కు రిఫర్ చేయాలని ఉందన్నారు.

సమస్య పరిష్కారం కాకపోవడంతో ఫిర్యాదు చేసిన 13 నెలల తర్వాత సుప్రీం కోర్టు తలుపు తట్టామన్నారు. ఏడేండ్లుగా మేం పోరాడుతున్నా నీళ్ల విషయంలో న్యాయం జరగలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటానికి సిఎం కెసిఆర్ చేసిన కృషి, తాపత్రయాన్ని మంత్రి షెకావత్ అర్థం చేసుకోవాలని చెప్పారు. ఇప్పటికైనా వెంటనే సమస్యలను పరిష్కరించేలా బ్రిజేష్ ట్రైబ్యునల్‌కు అనుసంధానం చేయండి.. లేదా కొత్త ట్రైబ్యునల్‌ను ఏర్పాటుచేయండి అంటూ కోరారు. సమావేశంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## రైతుల అస్తికలు గోదావరిలో నిమజ్జనం

- రైతుల సమస్యలు పరిష్కరించలేని కేంద్రం గద్దె దిగాలి
- వ్యకాస జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లఖింపూర్ ఘటనలో అమరులైన నలుగురు రైతులు, ఒక జర్నలిస్ట్ అస్తికలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం గోదావరిలో వ్యకాస, రైతు, కార్మిక తదితర సంఘాల ఆధ్వర్యంలో వ్యకాస జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ శుక్రవారం గోదావరిలో నిమజ్జనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ, విద్యుత్ చట్టాలు, కార్మికుల కోడ్‌లు రద్దు చేయాలనీ, లేకుంటే ప్రధాని మోడీ గద్దె దిగాలని డిమాండ్ చేశారు. లఖింపూర్ ఘటనలో దోషిగా తేలిన మంత్రి కుమారుడైన అశిష్‌మిశ్రాను కఠినంగా శిక్షించాలన్నారు. తక్షణమే అజయ్‌మిశ్రాను మంత్రి పదవి నుంచి తొలగించాలనీ, లేకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ.జె.రమేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపి మిడియం బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి కున్సోత్ ధర్మా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.బ్రహ్మాచారి, నాయకులు అన్నవరపు సత్యనారాయణ, వ్యకాస, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జాతోత్ కృష్ణ, కొరాడ శ్రీనివాస్, సిఐటియు పట్టణ కన్వీనర్ వై.వి.రామారావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యం.బి.నర్సారెడ్డి, బండారు శరత్ బాబు, నాగరాజు, లక్ష్మణ్, కెవిపిఎస్, ఐద్వా, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.